## ఓటేస్తే ల్యాప్‌టాప్‌లు, డైమండ్ ఉంగరాలు

### ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు భోపాల్ అధికారుల బంపరాఫర్

భోపాల్, ఏప్రిల్ 30: రండి.. ఓటేయండి ల్యాప్‌టాప్‌లు, డైమండ్ రింగ్‌లు గెల్చుకోండి.. అంటున్నారు మధ్యప్రదేశ్‌లోని భోపాల్ జిల్లా ఎన్నికల అధికారులు. ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు ఈ మేరకు నజరానాలు ప్రకటించారు. టీవీలు, ఫ్రిజ్‌లు, స్కూటర్లు, బైక్‌లు కూడా బహుమతులుగా ఇస్తామంటూ ఆఫర్లు ప్రకటించారు. 2019 ఎన్నికలతో పోలిస్తే 2024 మొదటి, రెండో విడత పోలింగ్‌లో మధ్యప్రదేశ్‌లో తక్కువ ఓటింగ్ శాతం నమోదైంది. దీంతో అప్రమత్తమైన భోపాల్ అధికారులు ఈ బహుమతి స్కీమ్‌ను ప్రవేశపెట్టారు. దీని కోసం భోపాల్‌లో పలు చోట్ల కూపన్ బాక్స్‌లను ఏర్పాటు చేశారు. అభ్యర్థులు తమ వివరాలతో ఫారాలను నింపి కూపన్ బాక్స్‌లలో వేయాలి. విజేతలు తాము ఓటేసినట్టు వేలిపై ఉన్న సిరా ముద్రను చూపిన తర్వాతే వారికి బహుమతి ఇస్తారు.





ఫడ్నవీస్



శరద్‌పవార్



ఉద్ధవ్ ఠాక్రే

# షుగర్ బెల్ట్‌లో పాగా ఎవరిది?

- పశ్చిమ మహారాష్ట్రలో హోరాహోరీ పోరు
- చాలా ఆశలు పెట్టుకున్న మహా వికాస్ అఘాడీ
- పట్టు నిలుపుకునే ప్రయత్నంలో మహాయుతి
- కంచుకోటను కాపాడుకోవాలని పవార్ పంతం
- కీలకంగా మారిన 10 లోక్‌సభ నియోజకవర్గాలు

ముంబై, ఏప్రిల్ 30: కేంద్రంలో ఎవరు అధికారం చేపట్టాలనేది నిర్ణయించడంలో మహారాష్ట్రది కీలకపాత్ర. దేశంలో ఉత్తరప్రదేశ్ తర్వాత అత్యధిక లోక్‌సభ స్థానాలు ఉన్నది ఇక్కడే. 48 స్థానాలు ఉన్న మహారాష్ట్రలో ఈసారి రాజకీయ సమీకరణాలు పూర్తిగా మారిపోయాయి. శివసేన ఇప్పుడు ఉద్ధవ్ వర్గంగా, షిండే వర్గంగా చీలిపోయింది. ఎన్సీపీ శరద పవార్ వర్గంగా, అజిత్ పవార్ వర్గంగా విడిపోయింది. కాంగ్రెస్, శివసేన(ఉద్ధవ్), ఎన్సీపీ(శరద్ పవార్) కలిసి మహా వికాస్ అఘాడీ(ఎంవీఏ)గా పోటీ చేస్తున్నాయి. బీజేపీ, శివసేన(షిండే), ఎన్సీపీ(అజిత్ పవార్) కలిసి మహాయుతి కూటమిగా ఏర్పడ్డాయి. దీంతో ఈసారి రాష్ట్రంలో రెండు కూటముల మధ్య హోరాహోరీ పోరు నెలకొన్నది. ముఖ్యంగా పశ్చిమ మహారాష్ట్రలో పాగా వేసేందుకు రెండు కూటములు శక్తియుక్తులన్నీ ఒడ్డుతున్నాయి.

**ఎంవీఏ ఆశలన్నీ ఇక్కడే**

పశ్చిమ మహారాష్ట్రలో పుణె, మావల్, శిరూర్, బారామతి, షోలాపూర్, మధ, సతారా, సంగ్లి, కొల్హాపూర్, హట్కనంగలె లోక్‌సభ స్థానాలు ఉన్నాయి. ఈ ప్రాంతం గతంలో ఎన్సీపీ, కాంగ్రెస్‌కు కంచుకోటగా ఉండేది. 2019లో ఎన్సీపీ 3, బీజేపీ 4, శివసేన 3 సీట్లు గెలిచాయి. మొత్తం మహారాష్ట్రలో ఎంవీఏ ఈ ప్రాంతంపైనే ఎక్కువ ఆశలు పెట్టుకున్నది.

**శరద్ పవార్‌కు కంచుకోట**

పశ్చిమ మహారాష్ట్రలో చెరుకు రైతులు ఎక్కువ. ఈ ప్రాంతాన్ని షుగర్ బెల్ట్ అని పిలుస్తారు. రైతు సహకార సంఘాల ప్రభావం ఈ ప్రాంతంలో ఎక్కువ. వీటిల్లో ఎన్సీపీ అధినేత శరద్ పవార్‌కు మంచి పట్టు ఉంది. ఈసారి తన పార్టీలోనే చీలిక రావడంతో పవార్‌కు కఠిన పరీక్ష ఎదురవుతున్నది. దీంతో కచ్చితంగా తన ఆధిపత్యాన్ని నిరూపించుకోవాలని పవార్ పట్టుదలగా ఉన్నారు.

### బీజేపీకి అసలైన సవాల్

బీజేపీకి మహారాష్ట్రలో ప్రతి సీటూ కీలకంగా మారింది. ముఖ్యంగా పశ్చిమ మహారాష్ట్రలోని 10 స్థానాల్లో మెజారిటీ గెలుచుకునేందుకు బీజేపీ తీవ్రంగా ప్రయత్నిస్తున్నది. అజిత్ పవార్ ద్వారా ఎన్సీపీ బలాన్ని తగ్గించేందుకు శతవిధాలా ప్రయత్నిస్తున్నది. అయితే, ఈ ప్రాంతంలో ఎన్సీపీ(శరద్ పవార్), కాంగ్రెస్ ఇప్పటికీ బలంగా ఉండటం, శివసేన(ఉద్ధవ్) కూడా కొన్ని చోట్ల బలంగా ఉండటం బీజేపీకి సవాల్‌గా మారింది.

# ఎన్నికల ముందు అరెస్టా?

- కేజ్రీవాల్ అరెస్టుపై ఈడీకి సుప్రీంకోర్టు ప్రశ్న
- జీవితం, స్వేచ్ఛ చాలా ముఖ్యమైనవని వ్యాఖ్య
- తదుపరి విచారణ వచ్చే శుక్రవారానికి వాయిదా
- సిసోడియా బెయిల్ పిటిషన్ కొట్టేసిన ఢిల్లీ కోర్టు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 30: సార్వత్రిక ఎన్నికల ముంగిట ఢిల్లీ సీఎం, ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్‌ను ఎందుకు అరెస్టు చేయాల్సి వచ్చిందని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ)ని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. మద్యం పాలసీకి సంబంధించిన మనీలాండరింగ్ కేసులో తన అరెస్టు, రిమాండ్‌ను సవాల్ చేస్తూ కేజ్రీవాల్ దాఖలు చేసిన పిటిషన్‌ను మంగళవారం జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ దీపాంకర్ దత్తాతో కూడిన ధర్మాసనం విచారించింది. ఈ కేసులో కేజ్రీవాల్ పాత్రకు సంబంధించి ఎలాంటి ఆధారాలు లేవని ఆయన తరపు న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ వాదించారు. ఈ కేసులో అప్రూవర్‌గా మారిన మాగుంట రాఘవ రెడ్డి మొత్తం ఎనిమిది స్టేట్‌మెంట్‌లు ఇచ్చాడని, మొదటి ఆరు స్టేట్‌మెంట్‌లలో కేజ్రీవాల్‌పై ఎలాంటి ఆరోపణలు చేయలేదని, చివరి రెండు స్టేట్‌మెంట్‌లలోనే ఆరోపణలు ఉన్నాయని, ఈ ఆరోపణలు చేసిన తర్వాత రాఘవ రెడ్డికి బెయిల్ మంజూరైందని సింఘ్వీ పేర్కొన్నారు. జైలు నుంచి విడుదలైన తర్వాత రాఘవ రెడ్డి బీజేపీ మిత్రపక్షమైన టీడీపీలో చేరిన విషయాన్ని ప్రస్తావించారు. మద్యం పాలసీ కేసులో ఆప్ నేత విజయ్ నాయర్‌ను 2022 నవంబరులో అరెస్టు చేశారని, కేజ్రీవాల్‌ను మాత్రం 2024 మార్చిలో అరెస్టు చేశారని పేర్కొన్నారు.



**ఈడీకి ప్రశ్నల వర్షం**

విచారణ సందర్భంగా ఈడీ తరపున విచారణకు హాజరైన అడిషనల్ సొలిసిటర్ జనరల్ ఎస్వీ రాజుకు ధర్మాసనం పలు ప్రశ్నలు వేసింది. విచారణ ప్రారంభమైన సమయానికి, కేజ్రీవాల్ అరెస్టుకు మధ్య ఎందుకు ఎక్కువ సమయం పట్టిందని, మనీలాండరింగ్ నిరోధక చట్టంలోని సెక్షన్ 8 ప్రకారం 365 రోజుల గడువు దాటొద్దు కదా అని ప్రశ్నించింది. జీవితం, స్వేచ్ఛ చాలా ముఖ్యమైనవని, వీటిని కాదనలేరని పేర్కొన్నది. సార్వత్రిక ఎన్నికల ముందరే ఎందుకు కేజ్రీవాల్‌ను అరెస్టు చేశారని అడిగింది. ఇప్పటివరకు ఈ కేసులో ఎటువంటి అటాచ్‌మెంట్ ప్రొసీడింగ్‌లు లేవని, ఒకవేళ ఉన్నట్లయితే పిటిషనర్(కేజ్రీవాల్) ప్రమేయం ఏంటో చూపించండని పేర్కొన్నది. మనీశ్ సిసోడియా కేసు విషయానికి వస్తే.. అనుకూలంగా, వ్యతిరేకంగా నిర్ధారణలు ఉన్నాయి. అలాంటప్పుడు కేజ్రీవాల్ కేసు ఎక్కడ ఉందో చెప్పగలరా? అని ప్రశ్నించింది. తమ ప్రశ్నలకు శుక్రవారం మధ్యాహ్నం తదుపరి విచారణలో జవాబులు ఇవ్వాలని ఆదేశించింది.

### సిసోడియా బెయిల్ పిటిషన్ కొట్టివేత

తనకు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ ఢిల్లీ మాజీ ఉప ముఖ్యమంత్రి, ఆప్ నేత మనీశ్ సిసోడియా దాఖలు చేసిన పిటిషన్‌ను ఢిల్లీ రౌస్ ఎవెన్యూ కోర్టు కొట్టేసింది. ఈ దశలో బెయిల్ మంజూరు చేయలేమని సీబీఐ, ఈడీ ప్రత్యేక న్యాయమూర్తి జస్టిస్ కావేరీ బవేజా పేర్కొన్నారు. కాగా, ఢిల్లీ కోర్టు ఆదేశాలను సవాల్ చేస్తూ సిసోడియా ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించనున్నట్టు ఆప్ తెలిపింది. సిసోడియాను గత ఏడాది ఫిబ్రవరి 26న సీబీఐ అరెస్టు చేసిన సంగతి తెలిసిందే.

### కేసు భయంతోనే నామినేషన్ విత్‌డ్రా

**ఇండోర్ కాంగ్రెస్ అభ్యర్థి వ్యవహారంలో కొత్త కోణం**

ఇండోర్, ఏప్రిల్ 30: ఇండోర్ లోక్‌సభ స్థానం నుంచి నామినేషన్ ఉపసంహరించుకున్న కాంగ్రెస్ అభ్యర్థి అక్షయ్ కాంతి బామ్ వ్యవహారంలో కొత్త కోణం వెలుగులోకి వచ్చింది. నామినేషన్ వేసిన మరునాడే అక్షయ్ బామ్ మీద 17 ఏండ్ల పాత ఘటనలో హత్యాయత్నం ఆరోపణలపై కేసు నమోదైంది. ఆయనపై ఓ భూవివాదానికి సంబంధించి కేసు ఇండోర్ జిల్లా కోర్టులో 17 ఏండ్లుగా పెండింగ్‌లో ఉంది. అయితే, నామినేషన్ వేసిన మరునాడే ఏప్రిల్ 24న ఈ కేసులో అక్షయ్‌పై అదనంగా హత్యాయత్నం సెక్షన్‌ను కూడా చేర్చినట్టు కోర్టు రికార్డుల్లో నమోదైంది.

### నాపై నెగ్గితే రాజకీయ సన్యాసం

**అమిత్ షాకు అభిషేక్ సవాల్**

మథురాపూర్: కేంద్ర మంత్రి అమిత్ షాకు బెంగాల్‌లోని టీఎంసీ నేత అభిషేక్ బెనర్జీ సవాల్ విసిరారు. మంగళవారం మథురాపూర్ ఎన్నికల సభలో ఆయన మాట్లాడుతూ డైమండ్ హార్బర్ లోక్‌సభ నియోజకవర్గం నుంచి తనపై పోటీ చేయాలని, ఒక వేళ షా నెగ్గితే తాను రాజకీయాల నుంచి వైదొలగుతానని ఛాలెంజ్ చేశారు. రాష్ట్రానికి రావాల్సిన బకాయిలు విడుదల చేసినా రాజకీయాల నుంచి రిటైరవుతానని అన్నారు.

### పోలింగ్ శాతాల వెల్లడిలో జాప్యమెందుకు?

**ఈసీని ప్రశ్నించిన విపక్షాలు**

న్యూఢిల్లీ : పోలింగ్ శాతాలను ప్రకటించడంలో ఎన్నికల సంఘం జాప్యంపై ప్రతిపక్షాలు ప్రశ్నలు లేవనెత్తాయి. తొలి దశ ముగిసి 11 రోజులైనా, రెండో దశ ముగిసి నాలుగు రోజులైనా తుది పోలింగ్ శాతాలను ప్రకటించకపోవడంపై కాంగ్రెస్, సీపీఎం, తృణమూల్ ఈసీని ప్రశ్నించాయి. ఈ క్రమంలో మంగళవారం ఈసీ తుది పోలింగ్ శాతాలను విడుదల చేసింది. మొదటి దశలో 66.14%, రెండో దశలో 66.71 ఓటింగ్ నమోదైందని వెల్లడించింది.

# ప్రజ్వల్‌పై సస్పెన్షన్ వేటు

**సెక్స్ స్కాండల్‌పై విమర్శలతో జేడీఎస్ చర్యలు**

**దోషిగా తేలితే శాశ్వతంగా సస్పెండ్**

బెంగళూరు: లైంగిక వేధింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న తమ పార్టీకి చెందిన హసన్ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణను జేడీఎస్ మంగళవారం సస్పెండ్ చేసింది. హుబ్బళ్లిలో పార్టీ కోర్ కమిటీ సమావేశం జరిగిన కొద్ది నిమిషాలకే సస్పెన్షన్ ప్రకటన వెలువడింది. సస్పెన్షన్‌పై జేడీఎస్ నేత కుమారస్వామి మాట్లాడుతూ దర్యాప్తులో ప్రజ్వల్ దోషిగా తేలితే అతడిని శాశ్వతంగా పార్టీ నుంచి సస్పెండ్ చేస్తామని తెలిపారు.

**సస్పెన్షన్‌ను స్వాగతిస్తూనే బీజేపీ కౌంటర్ దాడి**

ప్రజ్వల్ రేవణ్ణను జేడీఎస్ సస్పెండ్ చేయడాన్ని బీజేపీ స్వాగతించింది. అయితే అదే సమయంలో అధికార కాంగ్రెస్‌పై ఆ పార్టీ ఎదురు దాడి చేసింది.కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వానికి ఈ విషయం ఇప్పటి వరకు తెలియకుండా ఉంటుందా? అని ప్రశ్నించారు. మరోవైపు రేవణ్ణపై వచ్చిన లైంగిక వేధింపుల ఆరోపణల కేసుకు సంబంధించి మూడు రోజుల్లో సమగ్ర నివేదిక ఇవ్వాలని జాతీయ మహిళా కమిషన్ కర్ణాటక పోలీసులను కోరింది. ప్రజ్వల్ వీడియోలు లీక్ చేసింది నువ్వంటే.. నువ్వని ప్రజ్వల్ మాజీ డ్రైవర్ కార్తీక్, బీజేపీ నేత దేవరాజె పరస్పరం ఆరోపించుకున్నారు.

### అనంత్‌నాగ్-రాజౌరీ పోలింగ్ వాయిదా

న్యూఢిల్లీ, ఏప్రిల్ 30: అనంత్‌నాగ్-రాజౌరీ లోక్‌సభ స్థానానికి మే 7న జరగాల్సిన ఎన్నికల పోలింగ్ వాయిదా పడింది. ప్రతికూల వాతావరణం, రవాణా సమస్యలను పేర్కొంటూ ఈసీ పోలింగ్‌ను మే 25కు వాయిదా వేసింది. ప్రజా ప్రాతినిధ్య చట్టం-1951లో సెక్షన్-56 కింద పోలింగ్ తేదీని మే 7 నుంచి 25కు మార్చినట్టు తెలిపింది. ఈ స్థానం నుంచి పీడీపీ చీఫ్ మెహబూబా ముఫ్తీ సహా మొత్తం 20 మంది అభ్యర్థులు పోటీకి నిలబడ్డారు.



### శ్రీ శారదా మఠం అధ్యక్షురాలు కన్నుమూత

కోల్‌కతా, ఏప్రిల్ 30: శ్రీ శారద మఠం, రామకృష్ణ శారద మిషన్ అధ్యక్షురాలు ప్రవ్రాజిక ఆనంద ప్రాణ మాతాజీ(98) మంగళవారం కోల్‌కతాలో కన్నుమూశారు. వృద్ధాప్య సమస్యలతో బాధ పడుతున్న ఆమె ఇటీవలే దవాఖాన నుంచి డిశ్చార్చి అయ్యి శారదా మఠం ప్రధాన కార్యాలయంలో చికిత్స పొందుతున్నారు. మాతాజీ మృతికి ప్రధాని మోదీ, పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ సంతాపం తెలిపారు. ఆమె సేవలను వారిద్దరూ కొనియాడారు. గత ఏడాది జనవరి 14న మాతాజీ శ్రీ శారద మఠం, రామకృష్ణ శారద మిషన్ అధ్యక్షురాలిగా బాధ్యతలు స్వీకరించారు.

### తొలిసారి 'జగద్గురు'గా దళితుడు

**మహామండలేశ్వర్ మహేంద్రానందగిరికి ప్రదానం చేసిన జునా అఖాడా**



ప్రయాగ్‌రాజ్, ఏప్రిల్ 30: దేశంలోనే తొలిసారిగా షెడ్యూల్డ్ కులానికి చెందిన స్వామీజీ 'జగద్గురు' బిరుదు పొందారు. దేశంలోని 13 అఖాడాల్లో ఒకటైన జునా అఖాడా.. మహామండలేశ్వర్ మహేంద్రానందగిరికి ఈ బిరుదును ప్రదానం చేసింది. మహేంద్రానంద శిష్యుడు కైలాశానందగిరికి మహామండలేశ్వర్, రాంగిరికి శ్రీమహంత్ బిరుదు ప్రదానం చేసింది. వీరిద్దరూ ఎస్సీ సామాజిక వర్గానికి చెందినవారే కావడం గమనార్హం. ప్రయాగ్‌రాజ్ జునా అఖాడాలోని సిద్ధ బాబా మౌజిగిరి ఆశ్రమంలో సోమవారం వీరు వేదమంత్రోచ్చారణల మధ్య బిరుదులు స్వీకరించారు. ముగ్గురు స్వామీజీలు గుజరాత్‌కు చెందినవారు కాగా స్వామి మహేంద్రానంద సౌరాష్ట్ర రాజ్‌కోట్ జిల్లాలోని బానాల గ్రామానికి చెందినవారు. కాశీ సుమేరు పీఠాధీశ్వర్ జగద్గురువు, జునా అఖాడా అంతర్జాతీయ అధ్యక్షుడు స్వామి నరేంద్రానంద సరస్వతితోపాటు శ్రీమహంత్ ప్రేమ్‌గిరి, శ్రీదుధేశ్వర పీఠాధీశ్వర్, జునా అఖాడా, అంతర్జాతీయ అధికార ప్రతినిధి శ్రీమహంత్ నారాయణగిరి, మహామండలేశ్వర్ వైభవ్ తదితరులు బిరుదులు అందుకున్న వారిని పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమం సందర్భంగా మహేంద్రానంద, కైలాశలనందను సింహాసనంపై కూర్చోబెట్టి ఛత్రాలు బహూకరించారు. ఈ సందర్భంగా శ్రీమహంత్ ప్రేమ్‌గిరి మాట్లాడుతూ సన్యాసి సంప్రదాయంలో పాతుకుపోయిన కుల, వర్గ వివక్షను నిర్మూలించేందుకు జునా అఖాడా పనిచేస్తున్నట్టు చెప్పారు. మహాకుంభ్-2025కు ముందు ఈ దిశగా ముఖ్యమైన నిర్ణయాలు తీసుకుంటూ షెడ్యూల్డ్ కులాల వారికి జగద్గురు, మహామండలేశ్వర్, శ్రీమహంత్ వంటి ముఖ్యమైన బిరుదులను ప్రదానం చేస్తున్నట్టు చెప్పారు. జగద్గురు నరేంద్రానంద సరస్వతి మాట్లాడుతూ జునా అఖాడా నిర్ణయం స్ఫూర్తిదాయకమని కొనియాడారు. 2021లో హరిద్వార్ కుంభమేళాలో జునా అఖాడా మహేంద్రానందకు మహామండలేశ్వర్ బిరుదును ప్రదానం చేసింది. కార్యక్రమంలో స్వామి నరేంద్రానంద సరస్వతి, తదితరులు మాట్లాడారు.

# 10 మంది నక్సల్స్ మృతి

- ఛత్తీస్‌గఢ్‌లో మరో భారీ ఎన్‌కౌంటర్
- 15 రోజుల్లో రెండో పెద్ద ఆపరేషన్
- ఈ ఏడాది బస్తర్ రీజియన్‌లో 91 మంది మావోయిస్టులు మరణం

కొత్తగూడెం క్రైం: ఛత్తీస్‌గఢ్‌లో మరో భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. నారాయణ్‌పూర్, కాంకేర్ జిల్లాల సరిహద్దుల్లో మంగళవారం ఉదయం భద్రతా దళాల కాల్పుల్లో 10 మంది మావోయిస్టులు మరణించారు. వీరిలో ముగ్గురు మహిళలు ఉన్నారని పోలీసులు వెల్లడించారు. గత 15 రోజుల వ్యవధిలో మావోయిస్టులకు ఇది రెండో ఎదురుదెబ్బ. తాజా ఎన్‌కౌంటర్‌కు సంబంధించి అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. రెండు జిల్లాల సరిహద్దులోని అబూజ్‌మడ్‌లోని టేక్‌మేటా-కాకుర్ అడవుల్లో మావోయిస్టులు ఉన్నట్టు సమాచారం అందింది. దీంతో నారాయణ్‌పూర్ ఎస్పీ ప్రభాత్ కుమార్ నేతృత్వంలో జిల్లా రిజర్వు గార్డు(డీఆర్‌జీ), స్పెషల్ టాస్క్ ఫోర్స్(ఎస్టీఎఫ్) దళాలు సంయుక్తంగా సెర్చ్ ఆపరేషన్ చేపట్టాయి. ఈ క్రమంలో పెద్దసంఖ్యలో మావోయిస్టులు తారసపడి జవాన్లపైకి కాల్పులు జరిపారు. అప్రమత్తమైన జవాన్లు ఎదురు కాల్పులు ప్రారంభించారు. దీంతో ఇరువర్గాల మధ్య గంటకు పైగానే భీకర పోరు జరిగినట్లు తెలుస్తున్నది. ఘటనా స్థలిలో భారీ ఎత్తున ఆయుధాలు లభించాయి. నాలుగు నెలల వ్యవధిలో బస్తర్ రీజియన్‌లో జరిగిన వేర్వేరు ఎన్‌కౌంటర్లలో 91 మంది మావోయిస్టులు మృతిచెందారని అధికారిక వర్గాలు తెలిపాయి. తాజా ఎన్‌కౌంటర్‌పై ఛత్తీస్‌గఢ్ డిప్యూటీ సీఎం విజయ్ శర్మ మాట్లాడుతూ నక్సలైట్లు ప్రభుత్వంతో చర్చలకు రావాలని, హింసను వీడాలని కోరారు.



### వారానికి 24 గంటలే పని!

**విదేశీ విద్యార్థులపై కెనడా ఆంక్షలు**

టొరొంటో, ఏప్రిల్ 30: విదేశీ విద్యార్థుల పని గంటలకు సంబంధించి కెనడా కొత్త నిబంధనలు తీసుకొచ్చింది. విదేశీ విద్యార్థులు కొత్త విద్యా సంవత్సరం మొదలయ్యే సెప్టెంబర్ 1 నుంచి క్యాంపస్ వెలుపల వారానికి గరిష్ఠంగా 24 గంటల వరకు మాత్రమే పనిచేసుకునేందుకు అవకాశం ఉంటుంది. 'విద్యార్థులు క్యాంపస్ వెలుపల వారానికి 20 గంటలకు మించి పనిచేయడానికి అనుమతించే తాత్కాలిక విధానం ఏప్రిల్ 30తో ముగిసింది. ఈ పాలసీని పొడగించటం లేదు' అంటూ కెనడా మంత్రి మార్క్ మిల్లర్ తాజాగా వెల్లడించారు. వారానికి పని గంటల పరిమితిని 24 గంటలకు మార్చినట్టు తెలిపారు. విదేశీ విద్యార్థుల స్టూడెంట్ డిపాజిట్‌ను కెనడా ఇటీవలే భారీగా పెంచిన విషయం తెలిసిందే.

### అమేథీ, రాయ్‌బరేలీపై కొనసాగుతున్న సస్పెన్స్

**ఖరారు కాని కాంగ్రెస్ అభ్యర్థులు**

న్యూఢిల్లీ: గాంధీ-నెహ్రూ కుటుంబానికి ఎంతో కీలకమైన అమేథీ, రాయ్‌బరేలీ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ అభ్యర్థుల ఎంపికపై సస్పెన్స్ కొనసాగుతూనే ఉంది. ఈ రెండింటి నామినేషన్ల గడువు ఇంకా మూడు రోజులే ఉంది. అమేథీ, రాయ్‌బరేలీలలో రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలు పోటీ చేస్తారని ప్రచారం జరిగింది. కాగా, గాంధీ కుటుంబ సభ్యులనే ఇక్కడ పోటీకి దించాలంటూ అమేథీలో మంగళవారం కాంగ్రెస్ కార్యకర్తలు బైఠాయించి నిరసన తెలిపారు. ఇలావుండగా, హర్యానాలోని గురువావ్ కాంగ్రెస్ అభ్యర్థిగా నటుడు, రాజకీయ వేత్త రాజ్‌బబ్బర్‌ను, హిమాచల్ ప్రదేశ్‌లోని కాంగ్రాకు కేంద్ర మాజీ మంత్రి ఆనంద్ శర్మ పేర్లను కాంగ్రెస్ అధిష్ఠానం మంగళవారం ప్రకటించింది.

# మోదీ.. ఉద్యోగాలేవీ?

- దేశంలో తారస్థాయికి చేరిన నిరుద్యోగిత రేటు
- డిగ్రీ పూర్తైన 42% మందికి ఉద్యోగాలు లేనే లేవు
- అటకెక్కిన ప్రధాని ఏడాదికి 2 కోట్ల ఉద్యోగాల హామీ
- పదేండ్లలో భర్తీచేసిన ప్రభుత్వ ఉద్యోగాలు 7 లక్షలే

**ఏడాదికి 2 కోట్ల చొప్పున ఉద్యోగాలు కల్పిస్తామంటూ అధికారంలోకి వచ్చిన మోదీ సర్కారు.. పదేండ్లు గడిచినా ఆ హామీని నిలబెట్టుకోలేకపోయింది. దేశంలో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన 25 ఏండ్ల లోపు యువకుల్లో 42.3 శాతం మందికి పైగా ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్నట్టు అజీమ్ ప్రేమ్‌జీ యూనివర్సిటీకి చెందిన సెంటర్ ఫర్ సస్టెయినబుల్ ఎంప్లాయ్‌మెంట్ సంస్థ విడుదల చేసిన నివేదిక వెల్లడించింది. డిగ్రీ పూర్తిచేసిన యువకులు తగిన ఉద్యోగం లభించకపోవడంతోపాటు, తక్కువ స్థాయి ఉద్యోగాలు చేయడానికి ఇష్టపడటం లేదని, దీంతో నిరుద్యోగ రేటు పెరిగిందని నివేదిక పేర్కొంది. దేశంలో ఇప్పటికిప్పుడు ఉద్యోగాలు కావాల్సినవారు 22 కోట్ల మందివరకూ ఉన్నట్టు విశ్లేషకులు చెబుతున్నారు.**

(స్పెషల్ టాస్క్ బ్యూరో)


హైదరాబాద్, ఏప్రిల్ 30 (నమస్తే తెలంగాణ): ఏండ్లకేండ్లు ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాల భర్తీకి చర్యలు తీసుకోకపోవడం, ప్రైవేటు ఉద్యోగాల కల్పన లేకపోవడంతో నిరుద్యోగిత రేటు అంతకంతకూ పెరుగుతున్నదని సెంటర్ ఫర్ మానిటరింగ్ ఇండియన్ ఎకానమీ(సీఎంఐఈ) సర్వే పేర్కొన్నది. గ్రామీణ భారతంలో నిరుద్యోగిత రేటు సగటున 7 శాతం కంటే ఎక్కువగా ఉండగా, పట్టణాల్లో 8 నుంచి 10 శాతం ఉన్నట్టు వెల్లడించింది. కార్మిక భాగస్వామ్యం కూడా 42.9 నుంచి 39.8 శాతానికి పడిపోవడంతో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ఉపాధి పొందుతున్న వారి సంఖ్య పెరగటం లేదని ఆందోళన వ్యక్తం చేసింది.

**ఉపాధి రంగాలకు బడ్జెట్‌లో కోత**

దేశంలో నిరుద్యోగం ఏటికేటికి పెరగడానికి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం బడ్జెట్‌లో కేటాయింపులను తగ్గించడమే నని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. 2023-24 బడ్జెట్‌లో జాతీయ ఉపాధి హామీ పథకానికి కేంద్రం 33 శాతం నిధులు కోత పెట్టింది. అదేవిధంగా సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమలను బలోపేతం చేయడంపై శ్రద్ధ చూపకపోవడం, జాతీయ జీవనోపాధి మిషన్, గ్రామీణ గహ నిర్మాణ పథకం, తదితర సంక్షేమ రంగాలకు కూడా కేంద్రం బడ్జెట్ కేటాయింపులు తగ్గించడంతో ఆ ప్రభావం ఉపాధి కల్పనపై తీవ్రంగా పడింది. దీనికి తోడు జీఎస్టీ అమలు, పెద్ద నోట్ల రద్దు, కొవిడ్ సంక్షోభం తదితర కారణాలతో ఆర్థిక కార్యకలాపాల వేగం మందగించింది. స్టార్టప్ ఇండియా, మేకిన్ ఇండియా పథకాలు అటకెక్కడంతో నిరుద్యోగిత రేటు అమాంతం పెరిగిపోయింది.

**ప్రభుత్వరంగ సంస్థల్లో కోతలు**


కేంద్ర ప్రభుత్వం కొత్త ఉద్యోగాలు సృష్టించకపోగా ఉన్న ఉద్యోగాల్లో కూడా కోత పెడుతుండటంతో నిరుద్యోగుల సంఖ్య నానాటికి పెరుగుతున్నది. దేశంలోని మొత్తం 389 ప్రభుత్వ రంగ సంస్థల్లో 2014లో 16.9 లక్షల ఉద్యోగులు ఉండగా, 2022లో ఈ సంఖ్య 14.6 లక్షలకు తగ్గింది. ఒక్క బీఎస్‌ఎన్‌ఎల్‌లోనే గత తొమ్మిదేండ్లలో లక్షా 81వేల మంది ఉద్యోగులను ఇంటికి సాగనంపింది. ఏటా 2 కోట్ల ఉద్యోగాలిస్తామంటూ ప్రధాని మోదీ ఇచ్చిన హామీ ప్రకారం లెక్కేసుకున్నా.. గడిచిన పదేండ్లలో కొత్తగా 20 కోట్ల ఉద్యోగాల సృష్టి జరుగాలి. అయితే, ప్రభుత్వ రంగంలో కేంద్రం కేవలం 7 లక్షల ఉద్యోగాలను మాత్రమే భర్తీ చేసింది. అంటే ఏడాదికి సగటున 70 వేల పోస్టులను మాత్రమే నింపింది. ఇచ్చిన హామీలో ఇది 0.35 శాతం కూడా కాదు.




### కేంద్రప్రభుత్వం ఉపాధి కల్పన తీరు

| పదేండ్లలో భర్తీ చేస్తామన్న ఉద్యోగాలు | ఇప్పటివరకూ భర్తీచేసిన ప్రభుత్వ ఉద్యోగాలు |
|---|---|
| 20 కోట్లు | 7 లక్షలు |

ఇచ్చిన హామీలో ప్రభుత్వం భర్తీ చేసిన ఉద్యోగాల వాటా **0.35%**




### నిరుద్యోగ భారతం ఇలా..

| | |
|---|---|
| భారతదేశ జనాభా | 140 కోట్లు |
| పనిచేయగల మొత్తం శ్రామికశక్తి | 85 కోట్లు |
| పనికి తగిన వేతనం పొందుతున్న వారు | 30.4 కోట్లు |
| అర్హతకు తగిన ఉద్యోగం కోసం వేచిచూస్తూ ఇతర పనులు చేస్తున్నవారు | 32.8 కోట్లు |
| డిగ్రీ పూర్తయ్యి ఇప్పటికిప్పుడు ఉద్యోగం కావాల్సినవారు | 21.8 కోట్లు |

